

# పసిడిమనసులు - షర్మిల



## దేశం కోసం

"**అమ్మడమ్మా** ! నిన్ను చిట్టెమ్మ గారు ఎమ్మట పెట్టుకురమ్మన్నారు బేలెల్లండి! " కోటేశు పరిగెత్తుకుంటా వచ్చి చెప్పాడు.

"నేను ఆడుకుంటన్నా. ఇప్పుడు రాను" అన్నా .

నేను రోజూ సాయత్రం పాటి మీదకెళ్లి ఆడుకుంటా. నేను ఆటల్లో ఎప్పుడూ వెనక. ఆటల్లో ఏదో ఆటలో అరటిపండుని, పోనీ బొమ్మలాటలో. ఏనాడైనా  అమ్మగా వుండే చాన్స్ వస్తేనా!? ఎప్పుడూ పిల్లగానే. మళ్లీ బొమ్మలన్నీ నావే. తాయిలాలు పట్టికెళ్లేదీ నేనే. కానీ ఇవ్వాళ్ల నాకు అమ్మగా వుండే చాన్స్ వచ్చింది . రాక రాక వచ్చిన అవకాశం వదులుకుని నేను ఎందుకు వెళ్లాను ?

"నాన్నగారు ఏదో దేశం ఎల్తాన్నారంట. ఇంటి దగ్గిర వున్నాళ్లంతా బస్ ఎక్కిస్తానికి ఎళ్లారు. నువ్వూ రామ్మా! " బతిమాలాడు కోటేశు.

కోటేశు ఈ పాటికి రెండు సార్లు వచ్చి వెళ్లాడు. కానీ ఆట మధ్యలో వెళ్లటం ఇష్టం లేక నేను "రాను పో "అనేశాను .

చీకటి పడింది ఇక ఇంటికి చేరా. ఇంటికి వెళ్లటమే ఆలిస్యం మా చిట్టెమ్మ తిట్లు మొదలెట్టింది. "నీకేమొచ్చిందే? బిడ్డ యుద్ధానికి ఎళ్తా నిన్ను చూద్దామనుకుంటే రాకపోతివి... బస్ ఎక్కే వరకు నువ్వొస్తావని చూశాడు. నీకు నా బిడ్డ కంటే ఆటలు ఎక్కువైనయ్యా " అని అరిచింది.

మా నాన్న  17 సంవత్సరాలకే ఎయిర్ ఫోర్స్ లో చేరారంట. విమానాల్ని యుద్ధానికి సిద్ధం చేయడం ఆయన పని.

నాన్న ఇప్పటికే రెండు యుద్ధాలకి వెళ్లారట. ఒకటి  చైనాతో, రెండు పాకిస్తాన్ తో, మళ్లీ ఇప్పుడు బంగ్లాదేశ్ కోసం పాకిస్తాన్ తో యుద్ధమట. రోజులు గడుస్తున్నాయి.

రోజూ పోస్ట్ మేన్ సైకిల్ మీద పోస్ట్ సంచి  తీసుకుని మా ఇంటి మీదగా వెళ్లేవాడు. ఆ సంచిలోవన్నీ పోస్టాఫీస్లో స్టాంపులేసి ఇంటింటికీ ఎవరికి వుత్తరాలొస్తే వాళ్లకి ఇస్తాడు.

మా చిట్టెమ్మ పోస్ట్ మేన్ సంచి వైపు ఆశగా చూసేది. " అబ్బాయి మాకేమన్నా వుత్తరం వచ్చిందా? " అనడిగేది.

"సంచి తెరవకుండా నాకెట్టా తెలుస్తుందండీ...? ఒకేళ వుత్తరం వస్తే మీదే ముందు తెచ్చి  ఇస్తాలెండి" అని అభయం ఇచ్చేవాడు.

చాన్నాళ్లు గడిచాయి. రోజూ తాత ఎక్కడున్నా వార్తల టైముకి రేడియో పెట్టి వినేవారు. ఇంట్లో వాళ్లంతా వార్తల్లో యుద్ధం హోరాహోరీగా జరుగుతోందని విని నాన్న ఎట్టావున్నారో అని అనుకునే వారు.

" బిడ్డ ఎట్టావున్నాడో ఏంటో!?" అంటా చిట్టెమ్మ కళ్ల నీళ్లు పెట్టుకుంటే తాత తిట్టే వారు.

అమ్మని చూపించి " అది చూడు, ఎంత ధైర్యంగా నిబ్బరంగా వుందో! నువ్వూ నీ మేళం" అని విసుక్కున్నా తాత వార్తలని ఒక్కపూటా మానకుండా హడావిడిగా ఎక్కడున్నా వచ్చి వింటం చూస్తే ఆయనకీ కంగారుగా వుందని అందరికీ అర్థం అవుతూనే వుంది. చివరికి నాకు కూడా. ఏమీ తెలియదు  నా చిన్న తమ్ముళ్లకే ...

" వుత్తరం అన్నా రాయొద్దూ? ఎంత కంగారు పడతన్నాం ఇక్కడ " అని నాయనమ్మ అంటే " అమ్మా ! అన్నయ్యకి యుద్ధంలో ఏమైనా అయితే బట్టలు పంపిస్తారే " అని బాబాయి అనేవాడు .

"నీకేమొచ్చిందిరా అంత మాటన్నావ్? " అని ఎగిరితే " కాదే అన్నయ్యకి ఏమీ కాకపోబట్టే బట్టలు రాలేదు. జాగ్రత్తగా వచ్చేస్తాడులేవే" అని ఓదార్చే వాడు. నేను ఇవన్నీ వింటూవున్నానే గానీ నా గోల నాదే .

ఒకరోజు పోస్ట్ మేన్ మా ఇంటిముందు ఆగాడు. చిట్టెమ్మ రోజూలాగే పోస్ట్ మేన్ కోసం ఎదురుచూస్తోందేమో, ఒక్క అంగలో గేటు దగ్గరికి పరిగెత్తింది. అమ్మ కూడా అతృతగా చేసే పని ఆపి "ఎక్కడి నుంచి? " అనడుగుతాంది. అప్పటికే కవరు తీసుకున్న నాయనమ్మ అడ్రస్ మీద నాన్న చేతిరాత చూసి కళ్లనిండా నీళ్లు కారిపోతుండగా " అమ్మాయ్ ! ముకుంద వుత్తరం రాశాడు" అని అరిచింది .

పోస్ట్ మేన్ని " ఆగు బాబూ నువ్వు" అని ఇంట్లోకెళ్లి చేతికి దొరికిన నోట్లు తెచ్చి అతని చేతిలో కుక్కింది.

" అయ్యో ! ఎందుకండీ అక్కడ ఆయనగారు యుద్ధం చేస్తే నేను ఆ వుత్తరం మీకు చేరెయ్యడమే. చాలు వద్దు " అన్నాడు.

" అబ్బాయ్ పిల్లలకి ఏమన్న కొనుక్కెళ్లు . నా బిడ్డ చల్లగా వున్నాడన్న వార్త చేరేసావ్ నాయనా! నువ్వు చేసిన మేలు నేను మర్చిపోను " పైట చెంగుతో నీళ్లు తుడుచుకుంటా అంది.

" ఇక చాల్లే నువ్వా నీ గోల ! ముందా వుత్తరం దానికివ్వు " అనే లోగా బాబాయ్ " అన్నయ్య వుత్తరమా!? " అని లాగేసుకుని కవరు విప్పాడు .

అందులోనుంచి వుత్తరంతో పాటు రెండు ఫోటోలు బయటకు తీశాడు.

నాన్న గడ్డం పెరిగిపోయి వుంది. " వదినా ! అన్నయ్య ఫోటో తీసుకో చూడు " అని ఇచ్చాడు. అమ్మ మొకంలో ఎంత ఆనందమో!

వూరందరికీ నాన్న వుత్తరం వచ్చిందని తెలిసి వూపిరి పీల్చుకున్నారు. యుద్ధం ఆగిపోగానే సెలవు ఇచ్చారని ఇంటికి వస్తున్నానని మళ్లీ వుత్తరం వచ్చింది.

ఒక రోజు వుదయమే నాన్న బెడ్డింగ్, హోల్డాల్ పట్టుకుని రిక్షా దిగుతుండడం చూసి కోటేసు

" చిట్టెమ్మగారో ముకుందం గారొచ్చాశారండో " అని కేకలేశాడు .

నేను మాత్రం మా బాబాయ్ వెనకే నక్కి చూస్తున్నాను. ఎందుకంటే నా పసిపిల్లగా వున్నప్పటినుంచి మా తాతగారింట్లోనే వున్నా. అందుకే బాబాయ్ ఎక్కువ గారం... నాన్న అంటే ఒక చుట్టంలాగా చూస్తా.

వూళ్లో నాన్న కోసం మా జయభారతీ గ్రంధాలయంలో సన్మానం ఏర్పాటు చేశారు. నరసింహారావు పెద్దనాన్న ఇంకా చాలా మంది మాట్లాడారు. దేశాన్ని మా నాన్నే గెలిపించినట్టు వాళ్లు పొంగిపోతున్నట్టు అనిపించింది.

మొత్తానికి మళ్లీ అమ్మా నాన్నా తిరిగి వెళ్లే రోజు వచ్చింది అన్నీ సర్దుకుంటున్నారు.

నేను బడినుంచి వచ్చాను. రోజూలాగా ఆటలకి వెళ్లలేదు. సాయంత్రం బెజవాడ బస్ కి వెళ్తారని చెప్పుకోవడం విన్నా .

ఈ లోగా నా తోటి పిల్లలు వచ్చారు. ఈ రోజు ఆటలో నేను అమ్మగా వుండొచ్చట. కానీ నేను నాన్న వెళ్లేవరకు ఆటకి వెళ్లదలుచుకోలా, ఎందుకంటే మా నాన్న వూళ్లో అందరూ మెచ్చుకున్నట్టు దేశం కోసం ప్రాణాలు లెక్కచేయని వీరుడు. ఆ వీరుడి కోసం నేనొక రోజు ఆటని వదిలెయ్యలేనా!?

*(వచ్చేనెల మరో కథ)*

COMMENTS